

కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతలకు నిరసనగా ముషీరాబాద్ రోడ్ షోలో లాంతర్లు ప్రదర్శిస్తున్న ప్రజలు


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 6 మే 2024 | HYDERABAD




ముషీరాబాద్ రోడ్ షోలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

## రాహుల్ గాంధీవి పచ్చి అబద్ధాలు

1.8 శాతం తేడాతో కాంగ్రెస్‌లో అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని కేటీఆర్ అన్నారు. రాష్ర్టానికి వచ్చిన రాహుల్ గాంధీ నిర్మల్ సభలో పచ్చి అబద్ధాలు చెప్పారని, ప్రతి మహిళా ఖాతాలో నెలకు రూ. 2500లు, పింఛన్ రూ.4వేలు ఇస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జనవరి నుంచి ఒక్కో మహిళకు రూ.10వేలు, పింఛన్‌దారులకు రూ.16వేలు, ఆడబిడ్డలకు లక్షన్నర తులాల బంగారం బాకీ ఉన్నారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ అమాయకుడని..ఇక్కడి కాంగ్రెస్ నేతలు రాసిచ్చింది చదివారని, అసలు రేవంత్‌రెడ్డి ఎన్నికలు అయ్యాక కాంగ్రెస్‌లో ఉంటారో లేదో చూసుకోవాలన్నారు. రాహుల్‌గాంధీ చౌకీదార్ చోర్ అంటే..రేవంత్‌రెడ్డి మోదీ బడే బాయ్ అంటున్నారని, గుజరాత్ మోడల్ ఫేక్ అని ఆయన అంటే ..రేవంత్‌రెడ్డి మాత్రం గుజరాత్ మోడల్ తెస్తానంటున్నారని చెప్పారు. రాహుల్ అదానీ ఫ్రాడ్ అంటే.. రేవంత్‌రెడ్డి అదానీ మేరా ఫ్రెండ్ అంటున్నారని, అదానీకి సింగరేణి, ఇతర సంస్థలు కట్టబెట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

## రేవంత్‌వి చిల్లర మాటలు

'సీఎం హోదాలో రేవంత్‌రెడ్డికి హుందాతనం ఉండాలె.. కానీ చిల్లర మాటలు, ఉద్దెర పనులు చేస్తున్నారు'..అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ఐదు నెలల పాలన చూసిన గ్రామీణ ప్రాంత ప్రజలు పొరపాటు చేశామంటున్నారన్నారు. గతంలో ఐదు సీట్లతో తెలంగాణను ఎట్ల సాధించామో..అట్ల 10-12 సీట్లు ఇస్తే ఏడాదిలోగా మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసించే పరిస్థితి వస్తదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎండాకాలం వచ్చినా..రెప్పపాటు కరెంట్ పోలేదని, నీటి గోస లేదని కేటీఆర్ వివరించారు. కృష్ణా, గోదావరి నీళ్లను తీసుకొచ్చి మెరుగైన నీటి సరఫరా చేయలేని.. చేతకానీ దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ అని మండిపడ్డారు.

## కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పొలిటికల్ టూరిస్టులే..

గత ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు 24 సీట్లలో ఒక్కటి కూడా కాంగ్రెస్‌కు ఇవ్వలేదని, 16 సీట్లను బీఆర్ఎస్‌కు ఇచ్చి పట్టం కట్టారని, హైదరాబాద్ ప్రజలకు రుణపడి ఉంటానని కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంటులో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పొలిటికల్ టూరిస్టులేనని, స్థానికుడు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ఉప్పల్ రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని



ఎల్బీ నగర్ రోడ్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

# యూటీ చేసి.. లూటీకి కుట్ర

## అడ్డుపడాలంటే పార్లమెంటులో బీఆర్ఎస్ ఉండాలె

**పదేండ్లలో గ్రేటర్‌లో 36 పై ఓవర్లు కట్టాం..**

**బీజేపీ సర్కారు రెండు పై ఓవర్లు పూర్తి చేయలేకపోయింది**

**ఇదే కేసీఆర్ ప్రభుత్వానికి, మోదీ సర్కార్‌కి ఉన్న తేడా**

**ఎల్బీ నగర్, ఉప్పల్, ముషీరాబాద్ రోడ్ షోల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

సిటీబ్యూరో, మే 5(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా (యూటీ) చేసి నగరాన్ని లూటీ చేయాలని బీజేపీ కుట్ర చేస్తున్నదని, దీనిని అడ్డుకోవాలంటే పార్లమెంటులో బీఆర్ఎస్ ఉండాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరి, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఆదివారం ఎల్బీనగర్, ఉప్పల్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో కేటీఆర్ రోడ్ షోలు నిర్వహించారు. ఎల్బీనగర్‌లోని కర్మన్‌ఘాట్, ఉప్పల్‌క్రాస్‌రోడ్, ముషీరాబాద్ రాంనగర్ క్రాస్‌రోడ్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లలో కేటీఆర్ ప్రసంగించారు. 2014లో మోదీ ఎన్నెన్నో మాటలు చెప్పారని, ప్రతి ఒక్కరి అకౌంట్‌లో రూ. 15 లక్షల నగదు, రైతుల ఆదాయం రెట్టింపు, దేశంలో బుల్లెట్ ట్రైన్లు పరుగెత్తిస్తా, ప్రతి ఇంటికి నల్లా,



ఉప్పల్ రోడ్‌షోలో మద్దతు తెలుపుతున్న ప్రజలు

ఇండ్లు లేనోళ్లకు ఇండ్లు అని పెద్ద పెద్ద మాటలు చెప్పారని మండిపడ్డారు. నమో అంటే..నమ్మించి మోసం చేయడమని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌కు వరదలు వస్తే ఒక్క పైసా ఇవ్వలేదని, గుజరాత్‌కు వరదలు వస్తే మాత్రం రూ. వెయ్యి కోట్లు ఇచ్చారన్నారు. పప్పు, ఉప్పు నిత్యావసర వస్తువుల ధరలు పెంచారని, ప్రధాని మోదీని ప్రజలు పిరమైన ప్రధాని అంటున్నారని పేర్కొన్నారు. బీజేపీకి ఓటు ఎందుకు వేయాలంటే.. మేం గుడికట్టినం ఓటు వేయాలె అంటున్నారని, ఒక్క గుడి కట్టడమే ప్రామాణికమైతే.. అద్భుతంగా కేసీఆర్ యాదాద్రిని కట్టారని, దీంతో పాటు కాళేశ్వరం వంటి ఆధునిక దేవాలయమైన ప్రాజెక్టులు కట్టారని చెప్పారు. దేవుడిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం ఏమిటని.. దమ్ముంటే హైదరాబాద్ అభివృద్ధికి ఏం చేశారో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పదేండ్లలో గ్రేటర్‌లో ఎస్‌ఆర్‌డీపీ ద్వారా 36 ప్రాజెక్టులు కట్టామని, కేంద్రంలోని బీజేపీ సర్కారు నారపల్లి, అంబర్‌పేట ఫ్లై ఓవర్లు కట్టలేకపోయిందన్నారు. ఇదే మోదీ ప్రభుత్వానికి, కేసీఆర్ సర్కారుకు ఉన్న తేడా అని కేటీఆర్ అన్నారు.

> **పదేండ్లలో గ్రేటర్‌లో ఎస్‌ఆర్‌డీపీ ద్వారా 36 ప్రాజెక్టులు కట్టాం. కేంద్రంలోని బీజేపీ సర్కారు నారపల్లి, అంబర్‌పేట ఫ్లై ఓవర్లు కట్టలేకపోయింది. ఇదే మోదీ ప్రభుత్వానికి, కేసీఆర్ సర్కారు ఉన్న తేడా.**
>
> **హైదరాబాద్‌ను యూటీ చేసి..లూటీ చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నది. దీనిని అడ్డుకోవాలంటే పార్లమెంటులో బీఆర్ఎస్ ఉండాలె.**
>
> **-కేటీఆర్**

# కేబుల్ బ్రిడ్జిపై సీఐ కేక్ కటింగ్

**ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్**

**నిబంధనలు ప్రజలకేనా.. ఇన్‌స్పెక్టర్ తీరుపై విమర్శలు**

**విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు**

సిటీబ్యూరో/మాదాపూర్, మే 5 (నమస్తే తెలంగాణ): దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై కేక్ కట్ చేసిన మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లేశ్‌తో పాటు రాజేంద్రనగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌లకు సంబంధించి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో మాదాపూర్ డీసీపీ డా.వినిత్ స్పందించారు. కేబుల్ బ్రిడ్జిపై కేక్ కటింగ్ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని డీసీపీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కేబుల్ బ్రిడ్జిపై సెల్ఫీలు తీసుకుంటుండగా వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మరణించాడు. దీంతో కేబుల్ బ్రిడ్జిపై సెల్ఫీలు, పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడాన్ని నిషేధించారు. బ్రిడ్జిపై వాహనాలు నిలిపి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని కూడా హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఆదేశాలు జారీ చేసిన మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తోటి ఇన్‌స్పెక్టర్లతో కలిసి కేబుల్ బ్రిడ్జిపై బర్త్‌డే వేడుకలు జరుపుకోవడమేంటని సోషల్ మీడియా వేదికగా పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు స్పందించి సోషల్ మీడియాలో వైరలవుతున్న ఫొటోలపై విచారణకు ఆదేశించారు.



# హస్తం.. గల్లంతేనా..?

సిటీబ్యూరో, మే 5 ( నమస్తే తెలంగాణ ) : కాంగ్రెస్‌కు 'మహానగర' టెన్షన్ పట్టుకున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవకుండా ఘోర పరాజయం పాలైంది. బీఆర్ఎస్ విజయ దుందుభి ముందు కాంగ్రెస్ చతికిలపడింది. హస్తం రాజకీయ ఉద్దండులు సైతం ఓటమి పాలయ్యారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్నా.. ఆ పరిధిలోని మల్కాజిగిరి ఎమ్మెల్యే సీటును కూడా కాపాడుకోలేకపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల పోరులోనూ ఆ పార్టీకి ఓటమి భయం పట్టుకున్నది. ఎలాగైనా.. ఒక్క లోక్‌సభ స్థానానైనా గెలవాలని కాంగ్రెస్ నాయకులు సర్వం ఒడ్డుతున్నారు. అందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి నగరవ్యాప్తంగా ప్రచార సభలు నిర్వహిస్తున్నారు. కానీ, ఈ సభలకు జనం నుంచి పెద్దగా స్పందన రావడం లేదు. పదేండ్ల నగరాభివృద్ధితో కేసీఆర్ పాలన నగరవాసుల్లో నిక్షిప్తమై ఉండటంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు జంకుతున్నారు. గ్రేటర్‌లో 24 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవకపోవడమే ఇందుకు నిదర్శనం. బీజేపీ ఒక్క సీటు మాత్రమే గెలిచింది. అయితే కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రవ్యాప్తంగా ఎంత హంగామా చేసినా... గ్రేటర్‌కు వచ్చేసరికి మాత్రం చావుదెబ్బ మరోసారి తప్పదేమోననే భయంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

## అధికార పార్టీలో టెన్షన్.. టెన్షన్

- అసెంబ్లీ ఎన్నికల్లో మహానగరంలో కాంగ్రెస్‌కు ఘోర పరాజయం
- ఈ సారి లోక్‌సభ ఎన్నికలపై గంపెడు ఆశలు
- బీఆర్ఎస్‌ను తట్టుకొని నిలబడటం కష్టమేనని పార్టీలో చర్చలు
- కేటీఆర్ రోడ్ షో ముందు వెలవెలబోతున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం
- గులాబీ ప్రచార కార్యక్రమాలకు కిక్కిరిసిపోతున్న జనం
- ఓటమి భయంలో కాంగ్రెస్ నాయకులు
- పదేండ్ల అభివృద్ధితో బీఆర్ఎస్‌కే జై కొడుతున్న నగరం



## కేసీఆర్ పాలనలో మారిన హైదరాబాద్ ముఖచిత్రం

కేసీఆర్ పాలనలో కొత్తకొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడం, నేరాల సంఖ్య తగ్గడం, ఆహ్లాదకరమైన వాతావరణం, ఉపాధి అవకాశాలు, భిన్న సంస్కృతులు, గృహ వసతులు, వినియోగదారులకు అవసరమైన ఏ సామగ్రి అయినా అందుబాటులో దొరకడం.. ఇలా ఎన్నెన్నో... సాధ్యం చేసింది కేసీఆర్ ప్రభుత్వం. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కృషితో హైదరాబాద్ విశ్వనగరంగా పరుగులు తీసింది. ప్రపంచంలో అతిగొప్ప నగరాల్లో హైదరాబాద్‌ది ప్రత్యేక స్థానంగా మలిచారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో ప్రపంచ స్థాయి కంపెనీలు కొలువుదీరాయి. ఐటీ రంగంలో ఎగుమతులు మొదలు.. ఉద్యోగాల కల్పన వరకు బెంగళూరును దాటి.. హైదరాబాద్ వృద్ధి రేటును నమోదు చేసింది. మరోవైపు పదేండ్లలో వేల కోట్లతో కల్పించిన అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు హైదరాబాద్ ముఖచిత్రాన్నే మార్చాయి. నగరానికి వచ్చిన ప్రముఖులు నగరాభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయారు. గ్రేటర్ హైదరాబాద్ శాంతిభద్రతల విషయంలో ప్రశాంతంగా ఉండటం అందరినీ ఆకర్షించింది. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క చిన్న సంఘటన సైతం జరగలేదంటే.. శాంతిభద్రతలు ఎంత పకడ్బందీగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రశాంత వాతావరణంలో ఇదే అభివృద్ధి కొనసాగాలని గ్రేటర్‌వాసులంతా కోరుకుని బీఆర్ఎస్‌ను కడుపున పెట్టుకుని అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే లీడర్‌షిప్ కోసం లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు నగర ఓటర్లు ఆ పార్టీకి జై కొడుతుండటం విశేషం. ఈ పరిస్థితులను అర్థం చేసుకున్న కాంగ్రెస్, బీజేపీలు.. మహానగరంలో ప్రచారం అంటేనే జంకుతున్నాయి. అందుకే బీఆర్ఎస్ నుంచి నాయకులను లాక్కొని.. తమ పార్టీ అభ్యర్థులుగా నిల్చొబెట్టారని రాజకీయ నిపుణులు సైతం విమర్శిస్తున్నారు.

## కేటీఆర్‌కు బ్రహ్మరథం..

హైదరాబాద్..కేటీఆర్‌కు మధ్య విడదీయరాని బంధం పెనవేసుకున్నది. ఇక్కడి ప్రజలు కేటీఆర్‌ను తమ ఇంట్లో వ్యక్తిగా స్వీకరించారు. ఒక్క క్లిక్‌తో సోషల్ మీడియాలో కేటీఆర్ ప్రజల సమస్యలను పరిష్కరించేవారు. ఎంతో మంది కష్టాలను తీర్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కేటీఆర్ రోడ్ షోలతో నగరవ్యాప్తంగా ప్రచారం చేసి.. బీఆర్ఎస్‌ను గెలిపించారు. ఈ సారి కూడా లోక్‌సభ బరిలో కేటీఆర్ రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి ఫలాలు కేసీఆర్ పాలనలో ఎలా ఉన్నాయి? కాంగ్రెస్ పాలనలో ఎలా ఉన్నాయి? అనే అంశాలపై ఓటర్లను చైతన్యం చేస్తున్నారు. కేటీఆర్ రోడ్ షోలకు ప్రజల్లోనూ విశేష స్పందన వస్తున్నది. తమ కండ్ల ముందే కేసీఆర్ చేసిన అభివృద్ధి కనిపిస్తుండటంతో బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార సభలు వెలవెలబోతుంటే.. కేటీఆర్ ప్రచార కార్యక్రమాలు మాత్రం జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ పరిస్థితులను బేరీజు వేసుకున్న కాంగ్రెస్ పెద్దలు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదనే అంచనాకు వచ్చినట్టు వార్తలు వినిపిస్తున్నాయి.